# గోడ

**త**ూర్పు సముద్రంలో తుఫాన్. పగిలిన మబ్బుల్లోంచి విచ్చు కుంటున్న ప్రళయంలా పెనువర్షం. ఎగిసిపడే కెరటాలు. రాలిపడే చినుకులు. ఏకమవు తోన్న భూమ్యాకాశాలు.

తుఫాన్ వేళ సాయంత్రమే ముసురు కున్న రాత్రి చీకట్లు.

బీచ్ రోడ్డులో బస్టాప్. తడిసి ముద్దయిన దేహాలు. వర్షధారల్లోంచి తడవకుండా కాపాడుకోటానికి శరీరంలో అణుభాగమైనా లేదేమో! వెన్నెల్లో నిరీక్షిస్తున్నంత మామూలుగా ఆ బస్టాప్‌లో ఆ వర్షంలో చేరాల్సిన ప్రదేశాలకి చేర్చే ఏదో

ఒక వాహనం దొరకకపోతుందాని ఎదురుచూస్తున్నారంతా.

ఆ బస్టాప్‌లోకి పూర్తిగా తడిసిపోయిన సాగర్ కొత్తగా ప్రవేశించాడు. తడిచేత్తో కళ్లపై నీళ్లని తుడుచుకుంటూ నిలబడ్డాడు. కాసేపటికి చూపు కాస్త తెరిపినపడింది. చుట్టూ చూశాడు. తడిసినశరీరాలు. ఎదురుగా చూశాడు. ఆకాశమూ సముద్రమూ ఏకమైనాయి. తిరిగి చుట్టూ చూశాడు. ఓ చోట చూపు నిల్చింది.

అవును ఆమె.... నిజమే ఆమె మహిమే. 'మహిమా' చలికి పూడుకుపోయిన గొంతులోంచి మాట పెగల్టం లేదు.

'మహిమా'.... ఊహూ లాభం లేదు. మాట రావటం లేదు. పెదవుల కదలిక తప్ప. అతను ఆమెకి చేరువగా వెళ్ళి భుజం మీద చేత్తో చిన్నగా తట్టాడు. ఆమె వెనుదిరిగింది. తడిసిపోయిన కళ్లల్లో ఆశ్చర్యం తడిగా. 'సాగర్' చలికి గడ్డకట్టుకుపోయిన పిలుపు. మెల్లగా ఒకరిమాట ఒకరికి వినిపించేంత కొద్దిగా గొంతు సడలింది.

"ఇప్పుడు నీకే బస్సు, ఆటో దొరకదు. అదిగో ఆ కనిపించేది నేనుండే ఇల్లు. రా నాతో వచ్చేయి...." గాలి హెూరులా చెల్లాచెదురవుతున్న మాటలు.

ఆమె వంగి ట్రావల్‌బ్యాగ్ భుజానికి తగిలించుకొంది.

అడుగుముందుకి వేయనివ్వకుండా వెనక్కి తోసేస్తున్న ఈదురుగాలి. నీటి ఒత్తిడి. ఒకరివెంట మరొకరు. బ్యాగ్ భుజాలు మారుతూ. అడుగులో అడుగు. చేతుల్లో చెయ్యి. పడుతూ లేస్తూ ఈదుతూ అతని ఇంటికి ఇద్దరూ చేరారు.

"బట్టలు మార్చుకో. అదిగో అదే బాత్రూం" చెప్పాడతను.

అతను లోపలి గదిలోకి వెళ్ళాడు. బట్టలు మార్చుకొన్నాడు. తిరిగి ముందుగదిలోకి వచ్చేసరికి ఆమె అలానే తడిగా నిలబడివుంది.

"మార్చుకోలేదా" అడిగాడు.

ఆమె చూపులు నేలపై. ఆమె చూపులని అతని చూపులు అనుసరించాయి.

బ్యాగ్‌లోని బట్టలు నేలపై కుప్పపోసివున్నాయి. అవి నీళ్లల్లో

జాడించినట్టున్నాయి. "తుఫాన్" అంటూ అతను లోపలికి వెళ్లాడు.

తిరిగొచ్చాడు. చేతిలో లుంగి, లాల్చి, తువ్వాలు-ఆమెకి అందించాడు. అందుకొని బాత్రూంలోకి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి అతను గదిలో లేడు. తువ్వాలుతో తల తుడుచుకుంటూ లోపలికి వెళ్లింది. చీకటి. వంటగదిలో స్టవ్ వెల్గులో టీ చేస్తూ కనిపించాడు.

అతను ఆమెవైపు చూసి "అచ్చు కేరళైట్‌లా వున్నావ్" అన్నాడు.

ఆమె నవ్వింది. స్టవ్ వెలుగులో బుగ్గపై డింపుల్ తళుక్‌మంది.

"కరెంట్ లేదు" అన్నాడతను.

"క్యాండిల్, హరికేన్ లాంతరు లేవా"

ఆమెకి టీ అందిస్తూ "లేవు" అన్నాడు. ఓ గుక్క తాగింది. చల్లబడిన శరీరంలో వెచ్చదనం-వేడి టీతో మెల్లగా రాజుకుంటూంది.

"పూజ చేస్తావా" అడిగింది.

"లేదు" అన్నాడు.

"పూజామందిరమే లేదా"

"ఉంది. అమ్మ వచ్చినప్పుడు చేస్తుందిగా. ఏం"

"ఎక్కడుంది మందిరం"

"ఆ మూల"

చీకట్లో మెల్లగా నడిచి దేవుని దగ్గరున్న కుందెలో నూనె పోసింది. ఒత్తివేసి వెలిగించింది.

"నూనె దీపమా....అరే పిల్లా నూనె కొంచెమే వుంది" అన్నాడు.

"వంటపూర్తిచేసేయ్. ఆకలి. తినగానే దీపం తీసేద్దాం"

"వంటా...ఏంచేద్దాం....అన్నం, పప్పుచారు. కొద్దిగా మాగాయ వుంది. కూరగాయలేం లేవ్"

"ఏదో ఒకటి త్వరగా కానీయ్. ఆ ట్రైన్‌లో కూర్చుని కూర్చుని నడుం నొప్పి వస్తుంది. నిన్నట్నుంచి సరియైన తిండేలేదు" కుక్కర్‌లో

నీళ్లుపోస్తూ అంది.

"ఎక్కడ్నుంచి రాక. ఎక్కడికి పోతున్నావ్"

"మ(దాసు నుంచి మెయిల్లో. దారి పొడుగునా వానే. భీమ్లీలో వుండటం. అక్కడే ఉద్యోగం. ఎలాగోలా భీమ్లీ వెళ్లిపోదామనుకున్నాను. ఆ బస్సు ఆర్.కె. బీచ్ వరకు వచ్చి ఇంక వెళ్లనని మొరాయించింది. వానలో తడుస్తూ ఆ బస్టాండ్ వరకు చేరాను. ఇంతలో నువ్వు కన్పించావ్. అవునూ నువ్వెక్కడ్నుంచి రాక" బియ్యం కడుగుతూ అడిగింది.

"యూనివర్సిటీ నుంచి. నిన్న కథ రాశాను. ఆ పేపర్లు టేబుల్పైనే వుండి పోయాయి. కిటికీ తలుపులు వేశానో లేదోనని అనుమానమొచ్చింది. పేపర్లపై వెయిట్ పెట్టానోలేదో గుర్తులేదు. గాలికి కాగితాలు ఎగిరి పోతాయేమోనని బెంగ, మొదటిసారి కథ రాయటం కదా. ఆ అక్షరాలు ఈ తుఫాన్ నీళ్లలో కరిగిపోరాదని వెళ్ళాను" పప్పు కవ్వుతో కొలుస్తూ అన్నాడు.

"ఇంతకీ తలుపులు వేసొచ్చావా లేదా"

"వెయ్యటానికి మెయిన్ బిల్డింగ్ తాళాలు వాచ్మాన్ దగ్గరున్నాయి. బిల్డింగ్ చుట్టూ నాలుగు ప్రదక్షిణలు చేశాను. కానీ లోపల కాగితాలు ఏమయ్యాయో తెలీలేదు" దిగులుగా చెప్పాడు.

"కథలని పెన్తో రాయటం ఏంటింకా, కథలని రమేష్లా డైరెక్ట్గా కంప్యూటర్ మీదే కంపోజ్ చెయ్యాలి" అంది మహిమ.

"అవునూ నీకు వీళ్లంతా కనిపిస్తూనే వున్నారా"

"ఊఁ. హైదరాబాద్ పనిమీద వెళ్లినప్పుడంతా కలుస్తుంటారు. శ్రీశైల్ కవిత్వం రాస్తున్నాడు. 'ఏం చేద్దాం' ఏం చేద్దామంటూనే వున్నాడు. నీకెవ్వరూ కనిపించటం లేదా" అడిగింది.

"ఆ మధ్య కుమారి కనిపించింది. వాళ్లాయనకి విడాకులు ఇచ్చేసిందట. జీవితం ఇప్పుడెంతో హాయిగా వుందట" అన్నాడు. కుక్కర్ విజిల్స్ రాగానే ఆపారు.

ప్లేట్స్ టేబిల్పై సర్దింది. మధ్యలో దీపపుకుందె వుంచింది. నీళ్ళు గ్లాసుల్లో పోసింది. కుక్కర్ చల్లారిందోలేదో చూసి మూతతీశారు.

పళ్లాల్లో అన్నం, పప్పు పెట్టుకొన్నారు.

"ఆయిల్ లైట్ డిన్నరా" పప్పుకలుపుకొంటూ అంది.

"ఊ" అంటూ నవ్వాడు.

"పప్పు భలేవుందే!"

"పప్పా......అది పోలూరి వాళ్ల పప్పు. పుస్తకంలో చదివాను. నచ్చింది. అప్పట్నుంచి ఇలా చాలామందికి ఈ పప్పుని రుచిచూపిస్తున్నా. అఫ్‌కోర్స్ నీలా చాలామంది మెచ్చుకుంటున్నారనుకో" అన్నాడు.

"బాగుంది అన్నానంతే! ఎంత ఉపన్యాసం ఇచ్చావ్. ఇంకాస్త పప్పు వెయ్యి"

తింటూ తింటూ ఆమె పొలమారింది. అతను ఆమెకి మంచినీళ్ల గ్లాసు అందిస్తూ నెత్తిమీద చేత్తో తడుతూ "ఎవరో తలచుకుంటున్నట్టున్నారు" అన్నాడు.

"ఇంకెవరూ ఆ రైల్లో టి.టి.ఐ.యే..."

"ఆయన ఎవరూ...."

"రైల్లో టిక్కెట్‌లేని ప్రయాణం చేస్తున్నామో లేదో చూసే ఆయన" అంది.

"ఆ విషయం తెలుసు. నిన్నెందుకు తలచుకుంటున్నట్టు"

"రైలేమో ఎక్కడికక్కడ ఆగిపోతోంది. తెగ బోర్. ఏపని చేయటానికి లేదు. అందుకని కాసేపు అతన్ని ప్రేమించాను" అంది నవ్వుతూ.

"నువ్వు ప్రేమిస్తే నువ్వు తలచుకోవాలి కానీ అతను నిన్నెందుకు తలచుకుంటాడు" అడిగాడు.

"ఈ ట్రైన్ ఎంతసేపు ఆగుతుంది అని అడిగానంతే. అతను నా సమస్త విషయాల గురించి అంచెలంచెలుగా ప్రశ్నలు వేసేశాడు. ఆడపిల్ల ఓ ప్రశ్న వేయగానే అలా నిలువుగుడ్లేసుకొని మాట్లాడేస్తారు. ఆ విషయాన్ని అక్కడితో వదలరు. పైపెచ్చు అక్కడ్నుంచి ప్రేమంటూ వెంటపడతారు. ఐదు నిమిషాల్లో విడవలేనంత ప్రేమేంటిరా, ఆకర్షణ అనైనా అనరు. ప్రేమ అంటారేంటిరా? పెళ్ళి కాలేదా అంటారు. చేసుకోలేదయ్యా అంటే ఒంటరిగా వున్నారా....లోన్లీగా అన్పించదా....మగవాళ్ళంతా ఇంతేనేమో... కడవలకొద్దీ

సానుభూతి కురిపించేసి టెంపరరీగా మీకు తోడుంటాం అంటారు. నువ్వు చాలా ఆలశ్యంగా కనిపించావ్. అబ్బే! నాకు ఇప్పుడున్న జీవితం నరకంగా వుంది. నీతో జీవితాంతం వరకు కలిసి వుండాలని వుంది అంటూనే అంతవరకు ముందు శరీరాలని పెనవేసుకు పోదాం.... అంటూ ఎన్నెన్ని కథలని చెప్పేస్తారో. మేమేదో మా ఒంటరి జీవితాలకి వాళ్ళ ఆలంబన కోరినట్టు" తిన్న పళ్ళెంతీసి అంట్లగిన్నెల్లో పెడుతూ అందామె.

"నీకైతే బోల్డన్ని వ్యాపకాలు. చదువుతావ్. పాటలు వింటావ్. ఆ ప్రాజెక్ట్‌వర్క్ మీద ఊళ్ళు తిరుగుతావ్. అదీకాకుండా నువ్వెక్కడున్నా ఆ పరిసరాలలో, మనుష్యులలో నీకు నచ్చిన అంశాల్ని ఇష్టపడతావ్. నీలా అంతా వుండలేరుగా. ఒంటరితనంతో బాధపడేవాళ్ళు లేరంటావా" అడిగాడు.

"ఎవరో కొందరే ఒంటరితనంతో బాధపడతారా? చాలామందిలో ఆ దిగులుంటుంది. ఎప్పుడో ఒకప్పుడు అంతా అందులో కొట్టుకుపోతూనే వుంటాం. ఆ దిగులు, బెంగ ఎందుకో తెలిసినా మనం మన ఇష్టాలని, కోరికలని, ప్రేమలని నిర్భయంగా, స్వేచ్ఛగా వ్యక్తపరిచే స్థితి మనచుట్టూ లేదు కదా. ఎవరి లైఫ్‌స్టయిల్ వాళ్ళది అనుకోరు కదా! మనముందు ఓ వ్యవస్థని ఉంచారు. మనకి ఇరుగ్గా వున్నా అందులోనే ఉండాలా? బయటికి రావాలా? బయటికి వస్తే మనమీద విసిరే బాణాలని మనం ఎదుర్కోగలమా... మనచుట్టూ వున్న గోడలని మనం బద్దలు కొట్టగలమా.... అసలు కొట్టాలా వద్దా.....కొట్టటంవల్ల మనకి కావల్సింది మనకి దొరుకు తుందా....దొరుకుతుందని ఏమాత్రం అనిపించినా బద్దలు కొట్టొచ్చు. అనిపించకపోయినా కొట్టొచ్చు. లోపల ఏం లేదని తెల్సింది. బయట ఏముందో లేదో తెల్సుకోటానికి ఎందుకు వెనుకాడాలి" ఆమె మాట్లాడు తుండగా దీపం వెల్తురు కొద్దికొద్దిగా తగ్గీ తగ్గీ ఆరిపోయింది.

"నూనె అయిపోయింది' అన్నాడతను.

"మంచిది. పక్కలు వేసుకుందామా" అడిగింది.

"ఆ"

అతను చాప పరిచాడు. దానిపై బొంత పరుస్తూ "బొంతలు

భలేవుంటాయేం. మా అమ్మమ్మ వీటిని చాలా ఆర్టిస్టిక్‌గా కుట్టేది" అంది.

"ఈ బొంత మా నాయనమ్మ ఇచ్చింది" అన్నాడు.

ఆమె కిటికీ దగ్గరకి వెళ్ళి మెల్లగా తలుపు తెరిచింది. గాలి ఆమె ముఖాన్ని భళ్ళున కొట్టింది.

"అబ్బా ఏం తుఫాన్" అంటూ ఆమె కిటికీ రెక్క వెయ్యటానికి తంటాలు పడుతోంటే అతనొచ్చి తలుపుని గట్టిగా పట్టుకున్నాడు. ఆమె బోల్టు పెట్టింది.

"నిక్షేపంలా వేసున్న కిటికీని తీయటం ఎందుకు? వెయ్యటానికి ఇబ్బంది పడటం ఎందుకు" అన్నాడు.

"బయటేం జరుగుతుందో చూడొద్దా"

"బయటేం వుంది. వర్షమని తెలుసుగా"

"ఉత్తి వర్షమేనా. తలుపు తీయకపోతే ఆ గాలికి ఎంత బలం వుందో తెలిసేదా"

"సాయంత్రమంతా నడిరోడ్డులో ఆ గాలిలో కొట్టుకుపోయావు కదా... మళ్ళీ ఇప్పుడు కొత్తగా చూడ్డానికి ఏముంది"

"నాలుగుగోడల మధ్యనుంచి తుఫాన్ని చూస్తే ఎలా వుంటుందోనని"

ఆమె పడుకొని మెడవరకు దుప్పటి కప్పుకుంటూ "పాట పాడు" అంది.

"ఏ పాట" అడిగాడు.

"నీ ఇష్టం"

"దివారో సే మిల్‌కర్ రోనా

అచ్చా లగ్‌తా హై

హమ్ భీ పాగల్ హోజాయేంగే....

ఐసా లగ్‌తాహై

కిత్‌నే దినోంసే

ప్యాసీ హోంగే

యారో సోంచో..తో...

షబ్నమ్ కా టుకుడా బీ

జిస్ కో దరియా లగ్‌తా హై" అతను పాడాడు.

"నీకా పాటంటే ఇష్టం కదా" అడిగాడు.

"ఊ"

"నువ్వీ పాటని సిద్ధార్థని అడిగి మరీ పాడించుకునేదానివిగా. అతని దగ్గరే నేనీ పాట నేర్చుకున్నాను, నీకిష్టమని. కానీ నీకు వినిపించకముందే నువ్వు ఉద్యోగం అంటూ మా అందరి నుంచి వెళ్ళిపోయావ్" అన్నాడు.

"చదువులు అయిపోయాక ఇష్టమయిన బ్రతుకుతెరువు చూసుకోవాలిగా! నీకీ పాటకి అర్థం తెలుసా" అడిగింది.

"తెలియదు, చెప్పు"

"అర్థం చెప్పనా? నీ గొంతు బాగుంది. కానీ నీకీ పాట అర్థం తెలియక ఇన్‌వాల్వ్‌మెంట్‌తో పాడలేకపోతున్నావ్. 'కొండగాలి తిరిగింది' పాటని నువ్వు పాడినప్పుడు నిజంగా గుండె ఊసులాడుతుంది" అంది.

"అర్థం చెప్పు"

'గోడల్లో కలిసి దుఃఖించడం ఎంతో బాగుంటుంది. నేను పిచ్చివాడినైనా ఇలానే వుంటుంది. ఎన్నిరోజులుగా దాహంతో వున్నానో, కొంచెం ఆలోచించండి. ఓ మంచుముక్క కూడా నదిలా కనబడుతోంది...'

చీకటి. వర్షంహోరు. గాలిగొడవ. చలి. ఆ గదిలో ఆమె గొంతు జలపాతపు లోయలో మంచు కురుస్తున్నట్టు విన్పిస్తోంది.

అతను తిరిగి ఆ పాటే పాడాడు.

చీకటి దిగంతరేఖ మీద వంగి సృష్టిరహస్యం గుసగుసగా చెవిలో చెపుతున్నట్టుంది అతని స్వరం.

ఆమె చేయి చాపి అతని చెవిని మెలిపెడుతూ "కొండగాలి తిరిగింది పాడవా" అడిగింది.

అతను పాడటం మొదలుపెట్టాడు.

ఆమె చేతివేళ్ళు అతని జుట్టుతో ఆడుకుంటున్నాయి.

పాట తర్వాత పాట.

కళ్ళు మూసుకుని పాటలు వింటోంది.

పాడుతూ పాడుతూ చప్పున ఆమెవైపు తిరిగి ముఖమంతా ముద్దులు పెట్టాడు. ఆమె నవ్వుతూ అతనినుంచి తప్పించుకొంటూ "అబ్బాయ్ ఏంటిది" అంది.

"తుఫాన్"

"తుఫాన్‌గాలి అంటే...ఊహూ నాకు బెంగ. గోదారిగాలే ఇష్టం" నవ్వుతూ అంది.

అతను నవ్వుతూ ఆమె సమస్త దేహాన్ని అల్లుకుపోతున్నాడు.

ఆమె అతన్ని తిరిగి మెల్లగా వారించింది.

ఆ క్షణంలో సాగర్ నవ్వు ఆమెకి పరాయిగా కనిపించింది. అతని ప్రతికదలికలోనూ ఆమెకు తన సాగర్ కన్పించడంలేదు. సాగర్ లోపల్నించి మరో సాగర్ బయటకి వుబికివస్తున్నాడా అనిపిస్తోంది. అప్పటిదాకా సాగర్‌తో తను పంచుకున్న ప్రపంచమంతా వున్నట్టుండి తెగిపోయినట్టనిపించింది. చివరికి సాగర్‌కి కూడా తానొక శరీరంగానే కనిపిస్తోందా? ఆమె లోలోపల్నించి ఒక చురకత్తి మెలిపెడ్తున్న బాధ.

సాగర్ ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు.

మళ్ళీ ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు.

ఆమె దూరంగా జరిగింది.

"ఏం?"

"వద్దు"

"మహీ! ఎందుకు? ఉప్పెనలా దేహాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతోంటే ఈ వారింపు ఏమిటి?" నిష్టూరంగా అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"నిన్ను నేను ముద్దుపెట్టుకున్నా, నువ్వు నా జుట్టు, బుగ్గలని తాకినా

నీకు అభ్యంతరం లేదు. కానీ ఈ విషయంలో నీకెందుకింత అభ్యంతరం? నువ్వు కూడా సోకాల్డ్ పాతివ్రత్యం, శీలం అని ఆలోచిస్తున్నావా" చికాకుగా అడిగాడు.

మహిమ పక్కమీద నుంచి లేచి అతన్ని ఆనుకొని కూర్చుంటూ "శీలం.... పాతివ్రత్యం.....ఉహూ...అవేం కాదు సాగర్. ఏ ఏ ఎమోషన్స్ నన్ను ఎటు తీసుకువెళితే అటు అడుగేస్తున్నదాన్ని. ఈ సిస్టమ్‌లో ఇమడలేకేగా పెళ్ళి చేసుకోనిది. ఏదో ఒక ఉద్యోగం అంటూ ఒకేచోట కూరుకుపోనిది. కానీ ఈ విషయానికొచ్చేసరికి ఏ జాగ్రత్తలు తీసుకోకుండా ఎస్ అనలేను. ఏ క్షణంలోనైనా ఇలాంటి ఎమోషన్స్ ఎదురౌతాయని ఎప్పుడూ ఒక శారీరక జాగ్రత్తతో వుండటం అసాధ్యం కదా" అంది.

"ఏమవుతుంది? నువ్వూ అందరిలా ప్రపంచం ఏం తెలియనట్టు మాట్లాడతావేం? నువ్వేదో అందరికంటే భిన్నమైన దానివనుకున్నాను" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఏమవుతుందా? ఏమైనా కావొచ్చు. నీకు నాకు మధ్య ఓ సైకలాజికల్ క్లోజ్‌నెస్ రావొచ్చు. నువ్వూ, నేనూ, శ్రీశైల్, రమేష్ మనమంతా కాలేజీ దినాల్లో మంచి స్నేహితులం. అల్లరి చేసేవాళ్లం. బోల్డన్ని విషయాలు చర్చించేవాళ్లం. కానీ మన మధ్య ఇలాంటి విషయాలు ఎప్పుడూ వచ్చేవి కావు. ఈ విషయాలపట్ల మీరంతా ఎలా స్పందిస్తారో నాకు తెలియదు. ఈ విషయం జరిగాక నువ్వెలా రియాక్ట్ అవుతావో? ఏమేమి మాట్లాడతావో, నాపై నీకు హక్కు వుందనుకుంటావో, నే ప్రెగ్నెంట్‌ని అయితే బిడ్డని కనమంటావో, అబార్షన్ చేయించుకోమంటావో? నే బిడ్డని కనాలనుకుంటే నువ్వు వొద్దనొచ్చు. అబార్షన్ చేయించుకుంటానంటే కాదనొచ్చు. లేదా అస్సలు మొత్తం వ్యవహారంతో నీకే సంబంధం లేదనొచ్చు. లేదా ఇందాకా వచ్చాం, పెళ్లి చేసుకుందాం అనొచ్చు, కలిసివుందాం అనొచ్చు. ఇకపోతే ప్రపంచం తెలియకుండా లేను. నా రెండు చేతులూ చాచి, నాకు నేనుగా ఆహ్వానించే ప్రపంచమంటే నాకెంతో ఇష్టం. ఆ మోహ ప్రపంచం కోసం నేనే సంఘర్షణనైనా ఎదుర్కొంటాను" అని ఆగి ఆ చీకట్లోనే అసహనంగా వినిపిస్తున్న అతని ఊపిరి వింటూ అతని పక్కనే వున్న పక్కపై పడుకొని

దుప్పటిని మెడవరకూ కప్పుకుంటూ "కానీ నువ్వో ప్రపోజల్ పెట్టినప్పుడు నేను వద్దంటే, నేను ఎందుకు వద్దన్నానో నీకు నిజంగా తెలియదా? తెలిసికూడా తెలియనట్టున్నావో నాకు తెలియదు. కానీ నువ్వు నన్నేం అడిగావ్. 'నువ్వూ అందరిలా ఇలానే మాట్లాడతావా? నువ్వు ఇంకేదో అందరి కంటే భిన్నం అనుకున్నాను' అంటూ మా వ్యక్తిత్వాలతో మానిప్యులేట్ చేసే నీలాంటివాళ్ళకోసం కాదు" చెప్పింది మహిమ.

ఆమె నిద్రసవ్వడి వింటూ అచేతనంగా కూర్చున్నాడు. బయట తుఫాన్ హోరు కంటే గదిలోని ఆమె నిద్రసవ్వడి ఎక్కువగా అలజడి కలిగిస్తోంది.

అతను తలుపు తీసుకొని బయటికి వచ్చాడు.

తుఫాన్ మేఘం నిర్లక్ష్యంగా కురుస్తూనే వుంది.

పొద్దున్న తుఫాన్ భయపెట్టింది.

ఆ తుఫాన్ ప్రశాంతంగా వుంది అతని లోపలి తుఫాన్ కన్నా!